సాక్షి
అనంతపురం
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.37 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 539 టన్నుల కాయలు వచ్చాయి.



టమాట కిలో రూ.22
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.10 పలికింది.



జిల్లా అంతటా శనివారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండగా.. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

న్యూస్‌రీల్

'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కార్యక్రమాల్లో అధికారులు నిమగ్నమై ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు అహం వీడాలి



వీసీ రంగ జనార్దనను సత్కరించిన దృశ్యం

అనంతపురం సిటీ: విద్యార్థులు అహం వీడితే ఆదర్శవంతులవుతారని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ (వీసీ) ఆచార్య రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ(ఏ) అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. విశిష్ట అతిథులుగా రెక్టార్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్ రెడ్డి హాజరై విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. ఆచార్య దుర్గా ప్రసాద్ కళాశాల సాధించిన ప్రగతిని చదివి వినిపించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు.

చంద్రమౌళీశా.. శరణు



నాగాభరణ వాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వర స్వామి

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామి నాగాభరణ వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ చిట్టెమ్మ తదితరులు ఊరేగింపుగా నాగాభరణ వాహనం వద్దకు తీసుకొచ్చి ఆసీనులను చేశారు. కార్యక్రమంలో ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, ఏజెంట్ రాజన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా చిరుధాన్యాలు సేకరించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం నీలమయ్య

గుత్తి రూరల్/యాడికి: ప్రభుత్వ చౌక దుకాణాల్లో చిరుధాన్యాల పంపిణీకి రైతు భరోసా కేంద్రాల ద్వారా చిరుధాన్యాలు సేకరించాలని పౌరసరఫరాల శాఖ డీఎం నీలమయ్య ఆదేశించారు. శనివారం గుత్తి,యాడికి తహసీల్దార్ కార్యాలయాల్లో ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎం నీలమయ్య మాట్లాడుతూ రాగులు, సజ్జ, జొన్న, కొర్ర పంట ఉత్పత్తులను సేకరించాలన్నారు. జొన్న క్వింటా రూ.2,990తో కొనుగోలు చేయాలన్నారు. తహసీల్దార్లు మహబూబ్ బాషా, అలెగ్జాండర్, సీఎస్‌డీటీలు సూర్యనారాయణ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మూడునట్లేనా?!

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎస్.మంగమ్మ ఏకగ్రీవానికి మార్గం సుగమమైంది. సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను తెలియజేస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుండగా, టీడీపీ అభ్యర్థులు మాత్రం ప్రచారంలో వెనుకబడిపోయారు. ఓటమి భయంతో పార్టీ ముఖ్య నేతలు కూడా సహకరించకపోవడంతో డీలాపడ్డారు. గెలుపు సంగతి దేవుడెరుగు కనీసం రెండో స్థానంలోనైనా నిలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తే అదీ జరిగేలా కనిపించడం లేదు.



- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- ముఖ్య నేతల అండతో ఉత్సాహంగా అభ్యర్థుల ప్రచారం
- ఇప్పటికే మంగమ్మ విజయదరహాసం
- టీడీపీ అభ్యర్థుల తరఫున కానరాని ఆ పార్టీ నేతాగణం
- మొదట్లో అభయమిచ్చి ఇప్పుడు చేతులెత్తిన అధినాయకత్వం
- పీడీఎఫ్ అభ్యర్థే మెరుగ్గా ఉన్నట్లు తేలడంతో అంతర్మథనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

తెలుగుదేశం అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ప్రతిపక్షంలో కొచ్చాక కూడా ప్రజలపక్షాన నిలబడలేదు. దీంతో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఆ పార్టీ అభ్యర్థుల గెలుపోటములు పక్కన పెడితే పార్టీ ఉనికికే ప్రమాదం ముంచుకొచ్చింది. ఏ ముఖం పెట్టుకుని ఓట్లడగాలో నేతలకు పెద్ద సంశయంగా మారింది.

ఎవరికి వారే యమునా తీరే..

ఉమ్మడి అనంత జిల్లాలో టీడీపీ హయాంలో పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు మంత్రి పదవులు అనుభవించారు. ఆ సమయంలో ప్రజలకు వీసమెత్తు లబ్ధి చేకూర్చలేకపోయారు. దీంతో 2019 ఎన్నికల్లో 14 ఎమ్మెల్యే సీట్లకు 12 సీట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కట్టబెట్టారు. అధికారం కోల్పోగానే టీడీపీ నాయకులు కకావికలమయ్యారు. మరోవైపు వైఎస్సార్ సీపీ సర్కార్ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరికీ లబ్ధి చేకూరుస్తోంది. దీంతో ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకుల అవసరమే లేకుండా పోయింది. ఈ క్రమంలోనే ఆ పార్టీ నాయకులు కొన్నాళ్లుగా ఒంటరిగా మిగిలారు.

మూడుకు వెళితే అంతే సంగతులు..

తాజా ఎమ్మెల్సీ నామినేషన్లలో స్థానిక సంస్థల కోటా కింద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఇక మిగిలింది పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక. ఇందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పట్టభద్రులకు వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీకి రామచంద్రారెడ్డి పోటీలో ఉన్నారు. ఇప్పటికే వీళ్లిద్దరూ మూడు జిల్లాలూ చుట్టి వచ్చారు. టీచర్స్ స్థానంలో అభ్యర్థిని కూడా బరిలో నిలపని టీడీపీ... ఏపీటీఎఫ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డికి మద్దతు తెలిపి పోరు నుంచి నిష్క్రమించింది. ఇక మిగిలిన టీడీపీ పట్టభద్రుల అభ్యర్థి పరిస్థితి మాత్రం ఘోరంగా ఉంది. దీంతో రెండోస్థానం రాకుండా మూడో స్థానానికి పరిమితమైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఏంటన్న సందేహం నాయకులను వేధిస్తోంది. పట్టభద్రుల ఎన్నికలో టీడీపీ కంటే పీడీఎఫ్ అభ్యర్థే కాస్త మెరుగ్గా ఉన్నట్టు జనంలో చర్చ జరుగుతోంది.

స్టార్లు లేరు.. క్యాంపెయినర్లు అసలే లేరు..

టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్సీ టికెట్ తీసుకుని గుదిబండను మోస్తున్నామా అన్న భావనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఓవైపు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున ప్రతి ఎమ్మెల్యే, మంత్రులు వచ్చి భరోసా ఇచ్చి ప్రచారం నిర్వహిస్తుండగా, టీడీపీలో అభ్యర్థులను పట్టించుకునే దిక్కే లేదు. దీంతో అనవసరంగా పోటీలో దిగామా అన్న మీమాంస వారిని వెంటాడుతోంది. 2019లో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే ఒకరేమో నియోజకవర్గానికే రారు, మరొకరు బిజీగా ఉంటున్నారు. ఈక్రమంలోప్రచారమనే ఊసే లేకుండా పోయింది.

ఫేస్‌బుక్‌ను.. టెలీకాలర్‌ను నమ్ముకుని..

అధిష్టానం పరిస్థితి చూసి టీడీపీ అభ్యర్థులు విస్తుపోతున్నారు. విధిలేక ఫేస్‌బుక్‌ను, టెలీకాలర్‌ను నమ్ముకున్నారు. తరచూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టడం, టెలీకాలర్ ద్వారా నంబర్లకు ఫోన్‌లు చేయడం మాత్రమే చేస్తున్నారు. ఏ నియోజకవర్గంలోనూ నేతలు సహకరించడం లేదన్న విషయం అభ్యర్థులకు తెలియడంతో డీలాపడిపోయారు. ఎరక్కపోయి ఇరుక్కున్నామన్న చందమైందని వారు వాపోతున్నట్టు తెలిసింది.

ముగిసిన హెచ్చెల్సీ కోటా

- అదనపు కోటాతో కలిపి 32.821 టీఎంసీల నీరు విడుదల



హెచ్చెల్సీలో పారుతున్న నీరు

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీకి నీటి కోటా ముగిసింది. తుంగభద్ర జలాశయం నుంచి శనివారం నీటి సరఫరా నిలిచినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. ఈ ఏడాది అదనపు కోటా 4 టీఎంసీలతో కలిపి మొత్తం 32.821 టీఎంసీల నీటిని తుంగభద్ర జలాశయం నుంచి విడుదల చేశారని పేర్కొన్నారు. నీటి సరఫరా ఆగిపోవడంతో హైలెవల్ మెయిన్‌కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్స్‌కు నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. పంటల సాగు పూర్తవడంతో మిడ్‌పెన్నార్ జలాశయం దిగువన ఉన్న ఎంపీ సౌత్ కెనాల్‌కు ఇప్పటికే నీటి సరఫరా నిలిపేశామని, నార్త్‌కెనాల్‌కు మాత్రం మరో 10 రోజుల పాటు సరఫరా ఉంటుందన్నారు. మొత్తం ఈ ఏడాది 9.203 టీఎంసీలు తాగునీటికి, 13.957 టీఎంసీలు సాగునీటికి కేటాయించినట్లు వివరించారు. 85,398 ఎకరాలకు సాగునీటిని అందించామని, ఇందులో 34,445 ఎకరాల్లో వరి, 50,953 ఎకరాల్లో ఇతర ఆరుతడి పంటలు సాగయ్యాయని తెలిపారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 4.744 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 3.200 టీఎంసీలు, చాగల్లులో 0.950 టీఎంసీలు, పెండేకల్లు– 0.162 టీఎంసీలు, కణేకల్లు– 0.199 టీఎంసీల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు.

రబీ @ 2.72 లక్షల ఎకరాలు

- అత్యధికంగా కణేకల్లు మండలంలో పంటల సాగు

అనంతపురం అగ్రికల్చర్: రబీ పంటల లెక్క తేలింది. ఈ–క్రాప్ డేటా మేరకు సీజన్‌లో మొత్తం 2.72 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కణేకల్లు మండలంలో 35 వేల ఎకరాల్లో పంటలు సాగులోకి రాగా, అత్యల్పంగా అనంతపురం రూరల్ మండలంలో 2,500 ఎకరాల్లో వేశారు. 3.31 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని అధికారులు ముందస్తు అంచనా వేశారు. అయితే, ఖరీఫ్‌లో పెద్దవడుగూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు లాంటి ప్రాంతాల్లో పత్తి విస్తీర్ణం బాగా పెరగడం, ఉరవకొండ డివిజన్‌లో ఎండుమిరప ఎక్కువ విస్తీర్ణం వేసిన ఫలితంగా రబీ పంటల విస్తీర్ణం కొంచెం తగ్గినట్టైంది. ఖరీఫ్ పంటగా మిరప అంచనాకు మించి 62 వేల ఎకరాల్లో సాగవడమూ విస్తీర్ణం తగ్గడానికి కారణమైంది. అతి తక్కువగా పప్పుశనగ, వేరుశనగ, వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగులోకి వచ్చాయి. ఇప్పటికే ప్రధానపంట పప్పుశనగ మంచి దిగుబడులు రావడంతో నూర్పిడి కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఎకరాకు 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చినట్లు చెబుతున్నారు. మిగతా పంటలు కూడా ఆశాజనకంగా ఉన్నట్లు తెలిసింది.

71 వేల మంది ఈక్రాప్ బుకింగ్

జిల్లాలో ఈ–క్రాప్ తుది దశకు చేరుకుంది. ఈనెల 28లోపు తుది జాబితా ఇవ్వాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు రావడంతో ఆదిశగా చర్యలు చేపట్టారు. 71 వేల మంది రైతులు ఈ–క్రాప్ చేయించుకున్నారు. అందులో 64 వేల మంది రైతుల ఈకేవైసీ కూడా పూర్తయింది. గుమ్మఘట్ట బెళుగుప్ప, వజ్రకరూరు, శింగనమల, యల్లనూరు, డి.హీరేహాళ్, ఆత్మకూరు, బ్రహ్మసముద్రం మండలాలు ఈ ప్రక్రియలో కాస్త వెనుకబడ్డాయి. అనంతపురం, గుంతకల్లు, నార్పల, గుత్తి, కుందుర్పి, యాడికి, రాప్తాడు, పెద్దపప్పూరు, కూడేరు, తాడిపత్రి తదితర మండలాల్లో ఈ–క్రాప్, ఈకేవైసీ దాదాపు పూర్తయిందని సమాచారం.

రబీ సాగు విస్తీర్ణం ఇలా (ఎకరాల్లో)..	
కణేకల్లు	35 వేలు
ఉరవకొండ	26 వేలు
బెళుగుప్ప, పుట్లూరు, వజ్రకరూరు	20 వేలు
విడపనకల్లు	16 వేలు
తాడిపత్రి	14 వేలు
పెద్దపప్పూరు, యల్లనూరు	10 వేలకు పైగా

జర్నలిజానికే వన్నె తెచ్చిన వ్యక్తి తిమ్మారెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్



తిమ్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవులపల్లి అమర్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ జడ్జి కిష్టప్ప తదితరులు

అనంతపురం కల్చరల్: విలువలతో కూడిన జర్నలిజంతో ఈ రంగానికే వన్నె తెచ్చిన వ్యక్తి తిమ్మారెడ్డి అని రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలపై మంచి పుస్తకం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు తిమ్మారెడ్డి 23వ వర్ధంతి సభ శనివారం స్థానిక లలితకళాపరిషత్తులో నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన దేవులపల్లి అమర్ మాట్లాడుతూ తిమ్మారెడ్డి తనకెంతో ఆప్తుడన్నారు. జర్నలిజంలోకి ఒకప్పుడు సమాజ శ్రేయస్సును కాంక్షించేవారు వచ్చేవారని, నేడు పత్రికాధిపతులే సంఘ వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తూ విలువలను దిగజారుస్తున్నారన్నారు. కేవలం ఆర్థిక స్వావలంబన, సొంత ప్రయోజనాలకే ఒక వర్గం మీడియా పనిచేస్తోందన్నారు. తాము కోరుకుంటున్న వారే ప్రభుత్వాలను నడపాలనుకుంటున్నారని మండిపడ్డారు. కొన్ని వార్తా పత్రికలు, చానళ్ల అరాచకాలతో ప్రజలు జర్నలిస్టులను చులకనగా చూస్తున్నారన్నారు. మానవత్వంతో ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గద్దె దించడమే లక్ష్యంగా కొన్ని వార్తా సంస్థలు సాగిస్తున్న వికృత చేష్టలపై ఎంత మాట్లాడినా తక్కువేనన్నారు. నిస్సిగ్గుగా అసత్యాలనే కథనాలుగా వండివారుస్తుండడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్య అతిథి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో జర్నలిస్టుల తెగువ ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. పెన్ను పట్టిన సైనికులుగా జర్నలిస్టులను అభివర్ణించారు. బీసీ కమిషన్ మెంబర్, విశ్రాంత న్యాయమూర్తి క్రిష్టప్ప మాట్లాడుతూ జర్నలిస్టులను తమ స్వార్థప్రయోజనాల కోసం కొందరు వాడుకోవడం విచారకరమన్నారు. తిమ్మారెడ్డి ఆశయాలను కొనసాగించాలని కోరారు. కమ్యూనిస్టు నాయకులు వీకే రంగారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, రామాంజనేయులు తదితరులు తిమ్మారెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వామపక్ష భావజాలాన్ని, రాయలసీమ ఉద్యమ అవసరాన్ని ప్రపంచానికి చాటడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం 40 మంది సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. సీనియర్ జర్నలిస్టు విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, మానవతా తరిమెల అమరనాథరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పతకమూరి నాగరాజు, సీనియర్ న్యాయవాది ఐదుకల్లు రవి, ఎల్కేపీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జర్నలిస్టులు, పుర ప్రముఖులు

క్లుప్తంగా

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

గుత్తి: ఎంఈఓలందరూ తమ బాధ్యతలను సక్రమంగా, సకాలంలో నిర్వహించాలని డీఈఓ సాయిరాం అన్నారు. పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం డివిజన్ స్థాయిలో అకడమిక్ యాక్టివిటీస్‌పై ఎంఈఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ సాయిరాం మాట్లాడుతూ బైజూస్ ట్యాబ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యాశాఖలో అమలు అవుతున్న అన్ని రకాల పథకాలు, యాక్టివిటీస్‌పై పట్టు సాధించాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చే విధంగా హెడ్‌మాస్టర్లను, ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, డివిజన్‌లోని 16 మంది ఎంఈఓలు హాజరయ్యారు.

సీఐకి అభినందన



సీఐ మన్సూరుద్దీన్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన సీఐ మన్సూరుద్దీన్‌ను ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి అభినందించారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సీఐ మన్సూరుద్దీన్ ఎస్పీని కలిశారు. జాతీయస్థాయిలో అనంత పోలీసుల సత్తా చాటడం హర్షణీయమని ఎస్పీ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం

పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు కార్యక్రమాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికార యంత్రాంగం పకడ్బందీగా చేపడుతోంది.

- జిల్లా వ్యాప్తంగా 117 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ నిర్వహణకు 585 మంది సిబ్బంది
- జేఎన్‌టీయూ కళాశాలలో ఓట్ల లెక్కింపు

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహణకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ నేతృత్వంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ గాయత్రిదేవి పర్యవేక్షణలో ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, పోలింగ్ సిబ్బంది, ఓట్ల లెక్కింపునకు అవసరమైన చర్యలు చేపట్టారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ ఇవ్వనున్నారు.



బ్యాలెట్ బ్యాక్సులపై నంబర్లు వేస్తున్న దృశ్యం

పట్టభద్ర ఓటర్లు ఇలా...			
మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
3,30,124	2,22,340	1,07,751	33

ఉపాధ్యాయ ఓటర్లు ఇలా...			
మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
28,148	17,247	10,899	2

ఓటర్లు ఇలా...

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,30,124 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 2,22,340 మంది, మహిళ ఓటర్లు 1,07,751 మంది, థర్ జెండర్ ఓటర్లు 33 మంది ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తం 28,148 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 17,247 మంది, మహిళ ఓటర్లు 10,899 మంది, థర్ జెండర్ ఓటర్లు ఇద్దరు ఉన్నారు.

పోలింగ్‌కు 300 బ్యాలెట్ బాక్సులు..

అనంతపురం జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మొత్తం 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీకి 84 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో అనంతపురం నగరంలో 31 కేంద్రాలు, మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లో 53 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో అనంతపురం నగరంలో మూడు కేంద్రాలు, మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లో 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్‌కు 117 బ్యాలెట్ పెట్టెలు అవసరం ఉండగా 300 పెట్టెలను సిద్ధం చేయిస్తున్నారు. వాటికి నంబరింగ్ ప్రక్రియ జరుగుతోంది.

16 సెక్టార్లుగా విభజన..

పోలింగ్ నిర్వహణకు 585 మంది సిబ్బందిని నియమించనున్నారు. ఒక్కొక్క కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను, జూనియర్ పోలింగ్ అధికారిగా సచివాలయ ఉద్యోగిని నియమించనున్నారు. మొత్తం 117 పోలింగ్ కేంద్రాలకు 585 మందిని నియమించనున్నారు. జిల్లాను 16 సెక్టార్లుగా విభజించారు. 16 సెక్టార్లకు డివిజనల్ స్థాయి అధికారులను సెక్టార్ ఆఫీసర్లను నియమించనున్నారు. అలాగే 16 మందిని రూట్ అధికారులుగా నియమించనున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో...

జేఎన్‌టీయూ కళాశాలలో ఓట్లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను, ఓట్ల లెక్కింపునకు రెండు హాళ్లను సిద్ధం చేస్తున్నారు. పట్టభద్ర ఓట్ల లెక్కింపునకు 34 కౌంటింగ్ టేబుళ్లను, ఒక ఆర్‌ఓ టేబుల్ ఏర్పాటు చేస్తారు. అలాగే ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 18 కౌంటింగ్ టేబుళ్లు, ఒక ఆర్‌ఓ టేబుల్ ఏర్పాటు చేస్తారు. కౌంటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. అదే విధంగా వీడియో చిత్రీకరణ కూడా చేయిస్తారు.

పక్కాగా ఏర్పాట్లు



ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 13న పోలింగ్, 16న కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాము. ఈ ప్రక్రియల్లో పాల్గొనే సిబ్బందికి మార్చి మొదటి వారంలో అధికారులు రెండు దఫాలుగా శిక్షణ ఇస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ జేఎన్‌టీయూలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతపురం జిల్లా మినహా మిగిలిన ఐదు జిల్లాలకు బ్యాలెట్ పేపర్లను మార్చి 11న పంపించేందుకు చర్యలు తీసుకున్నాము. జిల్లాకు సంబంధించి మార్చి 12న పంపిణీ చేస్తారు.

– రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

రేషన్ బియ్యం పట్టివేత

తాడిపత్రి: పట్టణంలోని టైలర్స్‌కాలనీ వద్ద వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ ఆనందరావు తెలిపారు. యల్లనూరు గ్రామానికి శివకుమార్, కళ్యాణ్ బొలెరో పికప్ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రేషన్ బియ్యం బస్తాలను సివిల్ పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ ఆనందరావు పేర్కొన్నారు.

ఎరువుల బస్తాల సీజ్



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంకటరమణ, వాసుప్రసాద్ తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలంటే అధిక ధరలకు ఎరువుల బస్తాలు విక్రయించినట్లు తేలడంతో వెంకటేశ్వర, లక్ష్మీ నరసింహా ఫర్టిలైజర్ షాపుల్లోని దాదాపు 30 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వారి వెంట ఏఓ ఆంజనేయులు తదితరులున్నారు.

నకిలీ బంగారంతో మోసానికి యత్నం

- మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాడిపత్రి: బంగారు ఆభరణాల స్థానంలో నకిలీ నగలను ఉంచి ఓ బంగారు షాపు యజమానిని బురిడీ కొట్టించేందుకు యత్నించింది ఓ మహిళ. శనివారం తాడిపత్రిలోని ఓ బంగారు దుకాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన నరసమ్మ ఆమె కుమారుడు అశోక్‌తో కలసి తాడిపత్రి పట్టణంలోని ఓ బంగారు దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చింది. ఆ సమయంలో అసలు బంగారు ఆభరణాలను తీసుకుని, తన వద్ద ఉన్న నకిలీ బంగారు ఆభరణాలను ఒరిజనల్ స్థానంలో ఉంచింది. అవి నకిలీవని గుర్తించిన బంగారు షాపు యజమాని ఆమెను నిలదీయడంతో పాటు చుట్టుపక్కల బంగారు వ్యాపారస్తులతో కలసి సదరు మహిళతో పాటు ఆమె కుమారుడిని పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారిస్తున్నట్లు తెలిసింది.


భారీగా పరికరాల చోరీ

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి సమీపంలో ఉన్న కియా అనుబంధ పరిశ్రమ అయిన డీఎస్సీ కంపెనీకు చెందిన రూ.30 లక్షల విలువైన పరికరాలు అపహరించినట్లు కంపెనీ ప్రతినిధి డోనియన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. నాలుగు నెలల క్రితం పెనుకొండ వైపు నుంచి తమ కంపెనీకి డెలివరీ ఇవ్వాల్సిన ఎలక్ట్రానిక్ పరికరాలను క్యాంటర్ డ్రైవర్లు, మరి కొంతమంది కుమ్మక్కై అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలోని రెండిళ్లలో చోరీ

- రూ.లక్ష నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రూరల్‌లోని నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడ్డారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జరిగిన ఈ చోరీలకు సంబంధించిన నాల్గవ పట్టణ పోలీసులు వివరాలు వెల్లడించారు. ఏ.నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న వడ్డె గుర్రప్ప కుటుంబ సభ్యులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కూడా వారంతా ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బీరువాలో దాచి రెండున్నర తులాలు బంగారు నగలతో పాటు రూ.25 వేలు నగదుతో ఉడాయించారు. స్థానికులు గమనించి గుర్రప్ప కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.



బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

మరో ఇంట్లో..

ఇందిరమ్మ కాలనీకే చెందిన చెన్నరాయుడు ఇంట్లోనూ దొంగలు పడి రూ.75 వేలను ఎత్తుకెళ్లారు. చెన్నరాయుడు ఆటోడ్రైవరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శనివారం ఉదయం భార్యను వాళ్ల పుట్టింటి వద్ద వదిలి చెన్నరాయుడు తన పనిమీద వెళ్లాడు. సాయంత్రం 6 గంటలకు భార్యను వెంటబెట్టుకుని తిరిగి ఇంటికి చేరాడు. అయితే తాళం వేసిన ఇంటి తలుపులను ఎవరో తెరిచినట్లు కనిపించడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు తలుపులు తెరచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.75 వేల నగదు అపహరించుకెళ్లారని బాధితులు తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపే లక్ష్యం

తాడిపత్రి టౌన్: పశ్చిమ రాయలసీమ శాసన మండలి పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడమే లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూసగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక పుట్లూరు రోడ్డులోని ఏఎస్‌ఆర్ పంక్షన్ హాలులో శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో వెన్నపూస చెన్నకేశవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

బావిలో పడి రైతు మృతి

కూడేరు: కాలు జారి ఓ రైతు బావిలో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కమ్మూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. కమ్మూరుకు చెందిన రైతు నారాయణస్వామి (32) తన పొలంలో పని నిమిత్తం తన తండ్రి రాముడుతో కలిసి శుక్రవారం పొలానికి వెళ్లాడు. అనంతరం తండ్రి రాముడు ఇంటికి వెళ్లిపోయారు. అయితే నారాయణ స్వామి బావి దగ్గరకు వెళ్లినప్పుడు కాలు జారి నీటిలో పడిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు అంతా వెతికినా ఫలితం లేకపోయింది. శనివారం బావి దగ్గరకు వెళ్లి చూడగా నీటిలో నారాయణస్వామి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతునికి భార్య యశోద, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు.

పాముకాటుతో చిన్నారి మృతి



వినయ్ (ఫైల్)

ఉరవకొండ: పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నాగరాజు, రేణుకమ్మ దంపతుల కుమారుడు వినయ్ (2) శనివారం పాముకాటుతో మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రుల వివరాలమేరకు... ఇంట్లోనే ఆడుకుంటున్న చిన్నారి వినయ్ ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు చిన్నారి కాళ్ల మీద పాము కాట్లు ఉండటం గమనించారు. వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ మృతి చెందాడు. కాలనీ వాసులతో కలిసి ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్ పాము కోసం ఇంట్లో సోదించగా నాగుపామును గుర్తించి వెంటనే దాన్ని కొట్టి చంపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు పాము కాటుతో చనిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య

తాడిపత్రి: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాడిపత్రి పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన బేల్దారి లక్ష్మినారాయణ (45) శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు .. లక్ష్మినారాయణ కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి లక్ష్మినారాయణతో పాటు కుటుంబ సభ్యులంతా ఇంటి ఆరుబయట నిద్రించారు. అయితే అర్ధరాత్రి సమయంలో లక్ష్మినారాయణ ఇంట్లో ఉరేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఒంటరి జీవితం భరించలేక...

కళ్యాణదుర్గం: ఒంటరి జీవితం భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కళ్యాణదుర్గం పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పులిచెర్ల రాజు (40) అనే యువకుడు కదిరి నుంచి సుమారు ఆరేళ్ల క్రితం కళ్యాణదుర్గంకు ఉపాధి కోసం వచ్చాడు. పట్టణంలోని ఓ వెల్డింగ్ షాప్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో ఒంటరి జీవితాన్ని భరించలేక శుక్రవారం రాత్రి తాను పనిచేస్తున్న షెడ్డులోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రైలు కిందపడి మరొకరు..

తాడిపత్రి: తాడిపత్రి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రైలు కింద పడి నాగెళ్ల చిన్న కేశవరావ్ (45) ఆత్మహత్య చేసుకున్నట్లు తాడిపత్రి రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాలమేరకు.. ప్రకాశం జిల్లా, పెద్దగోగుల గ్రామానికి చెందిన నాగెళ్ల చిన్న కేశవరావు దాదాపు 12 ఏళ్లక్రితం భార్య విజయ, బిడ్డలను వదిలివేశాడు. వారిని పట్టించుకోకుండా అప్పటి నుంచి పలు ప్రాంతాల్లో తిరుగుతూ తనకు తెలిసిన చిన్నచిన్న పనుల ద్వారా జీవనం సాగించేవాడు. వచ్చే కూలీ డబ్బుతో మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఒంటరి జీవితాన్ని భరించలేక జీవితంపై విరక్తితో నాగెళ్ల చిన్న కేశవరావు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బిందు, తుంపర సేద్యంతో అధిక లాభాలు

- ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

రాయదుర్గం: బిందు, తుంపర సేద్యంతో రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించి అధిక లాభాలు ఆర్జించవచ్చని ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. జిల్లాలో ఈ సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహించి ఎక్కువ శాతం వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని కల్యం, మురడి, ఆవులదట్ల గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ రాయితీ ద్వారా అందించిన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. పీడీ మాట్లాడారు.. 2022-23 సంవత్సరానికి జిల్లాలో 11 వేల హెక్టార్లకు స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు అవసరమని ప్రణాళికలు సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. ఇందులో 10,700 ల హెక్టర్లకు రైతుల నుంచి డీడీలు సేకరించగా, 9,883 హెక్టార్లకు కలెక్టర్ ఉత్తర్వులు అందాయన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా 37,172 హెక్టార్లు కు డ్రిప్, స్ప్రింక్లర్లు అవసరమని 27,983 మంది రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. దీంతో మరో 2 వేల హెక్టార్లకు అదనంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపేలా చర్యలు చేపట్టామన్నారు. ఎమ్ఐఏఓ లక్ష్మినారాయణ, రైతులు పాల్గొన్నారు.



సబ్సిడీతో అందించిన డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న పీడీ ఫిరోజ్‌ఖాన్

క్లుప్తంగా

ప్రకృతిమాత సేవలో తరించాలి

– ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్



దేవులపల్లి అమర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్: ప్రకృతి మాతను కాపాడుకోవడం అందరి బాధ్యతగా గుర్తెరగాలని ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ అన్నారు. ప్రకృతి ధర్మపీఠం ట్రస్టు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయాన్ని దేవులపల్లి అమర్ సందర్శించి, అక్కడ జరుగుతున్న సేవలను కొనియాడారు. ధర్మపీఠం మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాస్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కరువు బారిన పడుతున్న ప్రదేశాలను సస్యశ్యామలం చేయడానికి విరివిగా మొక్కలు నాటాలని, అంతకు మించిన సేవ లేదన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజోపకరమైన సేవా కార్యక్రమాలు సాగుతాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధర్మపీఠం ట్రస్టు రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేష్, నెహ్రూ యువకేంద్రం అధికారి శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం కలిగించొద్దు

అనంతపురం క్రైం: వేసవి కాలంలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలిగించకూడదని 9వ డివిజన్ కార్పొరేటర్ దేవి, నాయకులు గంగాధర్ నగరపాలక సంస్థలో డీఈ నరసింహను శనివారం కోరారు. డివిజన్‌లో ఉదయం 8.30 గంటలకు నీటి సరఫరా చేస్తామని అధికారులు చెప్పడాన్ని వారు తప్పుబట్టారు. డివిజన్‌లోని వినాయకనగర్, ఫెర్రర్ గదులు, రాజమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే వారు అధికంగా ఉన్నారన్నారు. ఉదయం 8.30 గంటలకు వదిలితే నీరు పట్టుకొని ఎప్పుడు పనులకు వెళ్లాలని ప్రశ్నించారు.

59 మంది ఉద్యోగాలకు ఎంపిక

అనంతపురం రూరల్: పీవీకేకే డిప్లమా కళాశాలలో 59 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించగా, 59 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు తిరుపతి సమీపంలోని శ్రీ సిటీ విభాగంలో ట్రెనీ ఇంజీర్లుగా పని చేయాల్సి ఉందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ. 2 లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను బాలాజీ విద్యా సంస్థల అధినేత పల్లె కృష్ణకిశోర్,కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

దళితుడి భూమికి రక్షణ కల్పించండి



తహసీల్దార్ లక్ష్మీ నరసింహులుకు వినతి పత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

రాప్తాడు: ప్రభుత్వం దళితుడికి ఇచ్చిన భూమికి రక్షణ కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ కూడేరు మండలానికి చెందిన మాజీ నక్సలైట్ ఎల్లన్న అలియాస్ నాగరాజు జనజీవన స్రవంతిలో కలవగా, జీవనోపాధి కల్పిస్తూ హంపాపురంలో గ్రామ సర్వే నంబర్ 226–3లో 3 ఎకరాలపొలం ఇచ్చారన్నారు. ఆ పొలం యలమకూరి ఆంజనేయస్వామి ఆలయం వెనుక వైపు ఉన్నందున గ్రామానికి చెందిన అగ్రకులాలవారు కొందరు సాగులోకి రానివ్వకుండా అడ్డుపడుతున్నారన్నారు. అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్స్, డీ పట్టా, పాస్ బుక్, 1–బీ, అడంగల్, బ్యాంక్ లోన్, ఇటీవల సివిల్ అడిషినల్ కోర్టు ఇచ్చిన డిగ్రీ కాపీ ఉన్నా భూమిలోకి రానివ్వడంలేదన్నారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనరసింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ నక్సలైట్ ఎల్లన్న, ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు ఎర్రిస్వామి తాత

- నేటి నుంచి 3 రోజులు ఎర్రిస్వామితాత ఉత్సవాలు

రాప్తాడు: మహిమాన్వితుడు ఎర్రిస్వామి తాత జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో ఉన్న ఎర్రిస్వామి తాత ఆలయం వద్ద ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఉట్ల పరుష జరగనుంది. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. తొలిరోజు ఆదివారం స్వామికాపులు ఎర్రిస్వామి తాతకు పంచామృతాభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు ఆలయం దగ్గర ఉదయం నుంచి రాత్రి 9 గంటలకు వరకు భక్తులకు అన్నదానం ఉంటుంది. సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం 4 గంటల నుంచి పన్నేరపు బండ్లు కట్టి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకుంటారు. అదేరోజు రాత్రి 9 గంటలకు పంచరత్నాలు నాటకాన్ని ప్రదర్శిస్తారు. మంగళవారం ఎర్రిస్వామి తాత ఆలయం దగ్గర ఉదయం 8 గంటలకు దేశవు ఎద్దులతో జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం దగ్గర ఉట్ల పరుష జరుగుతుంది.



ఎర్రిస్వామి తాత మూలవిరాట్

ఇదీ ఆలయ చరిత్ర :

ఎర్రిస్వామి తాత అయ్యవారిపల్లికి చెందిన వీరప్ప, వీరమ్మ దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుంచే తన మహిమలను గ్రామస్తులకు చూపించేవారు. వర్షం రాక, పంటలు పండే విషయాలు గ్రామస్తులకు ముందుగానే చెప్పేవారు. ఒకేసారి రెండు చోట్ల గ్రామస్తులకు కనిపించేవాడు. 200 ఏళ్ల క్రితం ఎర్రిస్వామి తాత గ్రామ సమీపంలోని తన వ్యవసాయ భూమిలోనే జీవ సమాధి అవుతానని ముందు చెప్పి, చెప్పిన సమయానికే సమాధి అయ్యారని గ్రామస్తులు చెప్తారు. సమాధి అవ్వగానే ఇక్కడ గుడిని నిర్మించాలని చెప్పారట. దీంతో గ్రామస్తులు కాల్వ గొంచిగా ఏర్పడి అక్కడ గుడిని నిర్మించారు. ఇక్కడ పూజలు నిర్వహిస్తే ఆయురారోగ్యాల సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

గ్రామమంతా ఎర్రమ్మ, ఎర్రిస్వామి పేర్లే :

గ్రామస్తులకు ఎర్రిస్వామి తాత అంటే ఎంతో నమ్మకం. ఆచారం ప్రకారం ఎంతో ఇష్టంగా కొలిచే ఎర్రిస్వామి తాత పేరును గ్రామంలో అన్ని వేళల్లో పలుకుతూ ఉండాలని గ్రామంలో చాలా మంది ఎర్రిస్వామి, ఎర్రమ్మ అనే పేర్లు పెట్టుకున్నారు. గ్రామంలో అన్ని సామాజిక వర్గాల వారు స్వామి పేరు పెట్టుకోవడం విశేషం. 500 కుటుంబాలున్న గ్రామంలో ప్రతి కుటుంబంలో ఇద్దరి పేర్లయినా స్వామి పేరొచ్చేలా ఉంటాయి. దీంతో గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డు, రేషన్ కార్డులు, పింఛన్ల జాబితా, పాఠశాల రిజిష్టర్, ఓటర్ల జాబితాలో అధికంగా ఆ పేర్లే కనబడుతూ ఉంటాయి.

మాసుమా బీబీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పాతూరులో ఉన్న మాసుమా బీబీ దర్గాలో నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ శనివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మాసుమా బీబీ, సారాన్ బీబీని దర్శించుకొని పూల చాదర్‌ను సమర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. కార్పొరేటర్ బాబా, అనిల్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ షంషాద్దీన్, జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరి ఖాజా, సభ్యురాలు ఖమర్ తాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కువైట్ ఖాదర్‌బాషా, మహబూబ్ బాషా, షకీల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసుమా బీబీ గంధం ఉరుసు

నగరంలోని పాతూరులో ఉన్న సయ్యద్ మాసుమా బీబీ సయ్యదా సారాన్ బీబీ దైవ స్వరూపుల గంధం, ఉరుసు వేడుకలు శనివారం నిర్వహించారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో వీధుల్లో గంధాన్ని ఊరేగించారు. ఆదోనికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సయ్యద్ లతీఫ్ అహమ్మద్ ఖాద్రి, బనగానపల్లెకు చెందిన హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షా ఖాద్రి హాజరయ్యారు. వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ప్రార్థనల్లో పాల్గొన్న మేయర్ వసీం

మొండి బకాయిదారులకు సేవలు ఆపండి

- నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: ఇంటి, నీటి, ట్రేడ్ లైసెన్సు, తదితర పన్నుల చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మొండిబకాయిదారులకు సేవలు నిలిపివేయాలన్నారు. శనివారం నగరపాలక సంస్థలో రెవెన్యూ సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. పన్నుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఉన్న బకాయిదారులకు నోటీసుల జారీ చేయాలన్నారు. మొదటి వంద మంది మొండి బకాయిదారులకు తప్పక పన్ను చెల్లించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. వారి నుంచి స్పందనలేకపోతే నగరపాలక సంస్థ అందించే సేవలు (నీటి సరఫరా, తదితర)ను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. నగరపాలక సంస్థ, 17, 64, 54 సచివాలయాల్లోనూ, ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా పన్ను చెల్లించే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. నగరంలోని 50 డివిజన్లలో తిరిగేలా ఏర్పాటు చేసిన అనౌన్స్‌మెంట్ ఆటోలను నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు వేణు, మురళీ, పద్మావతి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అందుబాటులో ఉండాలి

సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పక అందుబాటులో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు చేశాం. అయినా ఎలాంటి మార్పులేదని 52వ సచివాలయ సిబ్బందిపై కమిషనర్ కే భాగ్యలక్ష్మి మండిపడ్డారు. శనివారం శ్రీనగర్‌కాలనీలోని సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో పట్టణ ప్రణాళిక కార్యదర్శి లోకేష్, వెల్ఫేర్ కార్యదర్శి రామాంజనమ్మ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటన పేరుతో విధులకు డుమ్మా కొడితే ఉపేక్షించేది లేదన్నారు.

పరిశ్రమల ఆధారిత సిలబస్ రూపొందించాలి

అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సుల్లో పరిశ్రమల ఆధారిత సిలబస్‌ను రూపకల్పన చేయాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో 'వేగా ప్రాసెసర్స్ అండ్ ఎకో సిస్టమ్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ది సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డాక్) తిరువనంతపురం సంస్థ రూపకల్పన చేసిన ఈ ప్రాసర్ 1979–83 బ్యాచ్ పూర్వ విద్యార్థులతో అందించారు. ఈ అంశంపై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో యూనివర్సిటీ సిలబస్ 70 శాతం నుంచి 80 శాతం పరిశ్రమల ఆధారంగా ఉంటుందన్నారు. కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్ట్, ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యార్థులు అనేక సబ్జెక్టులు ఆన్‌లైన్‌లో చదివే విధంగా ప్రవేశపెట్టామన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. భవానీ, వర్క్‌షాప్ కోఆర్డినేటర్లు డాక్టర్ విష్ణువర్దన్, డాక్టర్ కే మాధవి ,1979–83 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పి.సత్యనారాయణ, రమాకాంత్ దేశాయ్, సీడాక్ అనంతపురం ప్రతినిధులు నీతా, సేలిన్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన

పారిశ్రామిక వేత్తలుగా ఎదగండి

అనంతపురం సిటీ: ఎంబీఏ విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ ఆచార్య రంగజనార్దన ఆకాంక్షించారు. శనివారం అనంతపురంలోని జేఎన్‌టీయూఏ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ) విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. వీసీ ప్రసంగిస్తూ కష్టపడి చదివి ఉన్నత శిఖరానికి చేరుకున్న ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి వంటివారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంబీఏ విద్యార్థులు మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో పాటు కొత్త టెక్నాలజీపై పట్టు సాధించాలని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. 2009లో ప్రారంభించిన ఎంబీఏ విభాగం సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా తర్ఫీదు నిస్తోందని ఎంబీఏ విభాగాధిపతి ఆచార్య నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ ఆచార్య కేశవరెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ జోజిరెడ్డి, పీఆర్ఓ రామశేఖరరెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాప్తాడురూరల్: వ్యక్తి అదృశ్యంపై అనంతపురం రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు గౌతంవిల్లాస్ సమీపంలోని సప్తగిరి కాలనీలో రాగులపాడు గోపాల్‌రెడ్డి, రాగులపాడు రాధా దంపతులు నివాసం ఉంటున్నారు. ఇంటివద్దే చీరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 4న గోపాల్‌రెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులకు ఆచూకీ దొరకలేదు.దీంతో భార్య రాధా రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గవర్నింగ్ బాడీ సమావేశం



మాట్లాడుతున్న యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ వై.వెంకట్రామిరెడ్డి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 11వ గవర్నింగ్‌బాడీ సమావేశం శనివారం నిర్వహించారు.యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ వై. వెంకట్రామి రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. బడ్జెట్ ప్రతిపాదనలు, పరీక్ష నిర్వహణ, ఫలితాలు ప్రకటన, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలపైన, పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత కన్వీనర్‌గా వ్యవహరించారు. డాక్టర్ బి.అనంతరెడ్డి, హరినాథ్ రావు, డాక్టర్ డి.రామసుబ్బా రెడ్డి (ఐఐటీ చెన్నై) ఆన్‌లైన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ సి.శోభాబిందు, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సాహితీ బ్రహ్మోత్సవాల కన్వీనర్‌గా గుత్తా హరి

అనంతపురం కల్చరల్: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల ప్రోగ్రాం కన్వీనర్‌గా జిల్లాకు చెందిన కవి గుత్తా హరిసర్వోత్తమ యడును నియమించారు. ఈ మేరకు శనివారం శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆయనకు అధికారికంగా సమాచారం అందించారు. అందులో ఏప్రిల్ 9, 10 తేదీల్లో తిరుపతిలో శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 48 గంటల నిర్విరామ సాహితీ కార్యక్రమాలతో ప్రపంచ రికార్డు కార్యక్రమం జరుగుతుందన్నారు.

ప్రారంభమైన బాస్కెట్‌బాల్ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ఇండోర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీని శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్ర చౌదరిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఇలాంటి టోర్నీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ టోర్నీలో 8 బాలుర జట్లు, 4 బాలికల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేఘనాథ్, అశోక్ రెడ్డి, రవికుమార్, బాలచంద్ర, వెంకటేశులు పాల్గొన్నారు.

ఈనాడు రాతలపై నిరసనాగ్రహం

అనంతపురం: ఈనాడు తప్పుడు రాతలపై వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు నిరసన తెలిపారు. శనివారం ఎస్కేయూ క్యాంపస్‌లో వైఎస్సార్ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు నిరసన తెలుపుతున్నామన్నారు. ఈనాడు దిన పత్రికలో వస్తున్న తప్పుడు కథనాలను వ్యతిరేకిస్తూ ఆ పత్రిక ప్రతులను దహనం చేసి, నిరసన తెలియజేశారు. ఎలాగైనా సరే తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని పచ్చపత్రిక దిగజారుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పచ్చపత్రికను అడ్డుపెట్టుకొని రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని చూస్తున్నాడన్నారు. ప్రభుత్వంపై ఈనాడు అధినేత రామోజీరావు నిత్యం తన అక్కసును వెళ్లగక్కుతున్నాడన్నారు. పచ్చపత్రికలో ప్రభుత్వంపై ప్రజల్లో విద్వేషాన్ని పెంచేలా కట్టుకథలు రాస్తున్నారని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్కేయూ వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్ కుమార్, చిగండి రమేష్, సునీల్ యాదవ్, నితిన్ రెడ్డి, అనిల్, సోషల్ మీడియా కన్వీనర్లు మంచాల హర్ష రెడ్డి, తేజేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



ఈనాడు దిన పత్రికను దహనం చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

జగన్‌తోనే నాయీ బ్రాహ్మణులకు ఆత్మగౌరవం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణుల ఆత్మగౌరవం నిలిపారని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, రాయలసీమ అధ్యక్షుడు రామకృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో దూషించకుండా ప్రత్యేక జీఓను తీసుకొచ్చారన్నారు. నాయీబ్రాహ్మణుల గురించి మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని మండిపడ్డారు. ప్రస్తుతం 18 ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తోకలు కత్తిరిస్తామని అన్నప్పుడు ఈ నాయకులు ఎక్కడ దాక్కున్నారో చెప్పాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇంత పెద్ద ఎత్తున బీసీలకు సీట్లను, నామినేటెడ్ పదవులు కేటాయించలేదన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో అనంత నగరాభివృద్ధి పెద్ద సంఖ్యలో జరుగుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయభాస్కర్, యువజన సంఘం నాయకులు శివకుమార్, జిల్లా వాయిద్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నగర అధ్యక్షుడు బంకు శ్రీన, ఇందిరానగర్ హరి, రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'రఘు' విద్యార్థుల సత్తా

అనంతపురం సిటీ: సైనిక్ స్కూల్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని సంగమేశ్ నగర్‌లోని రఘు సైనిక్ స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేశ్ శనివారం తెలిపారు. తమ పాఠశాల నుంచి మొత్తం 280 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా, 256 మంది విద్యార్థులు అర్హత సాధించడం గర్వంగా ఉందన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందించారు. జనవరి 8న నిర్వహించిన ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 9వ తరగతిలో ఖాజీ మొయిన్, సాయి వినాయక్ 350 మార్కులతో ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. 6వ తరగతిలో సిద్దీక్ష 254 మార్కులతో(ఆంగ్లంలో 50/50) ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. హార్షవ్ 248 (రీజనింగ్ 50/50), చేతన్ 242, చంద్రహాస 240, గౌతం నిహార్ 237, సాయి కార్తికేయ 234, భువన్ సాత్విక్ 231, కీర్తన 230, గేయాన్విత 228, అభినేత్రి 227, జోత్స్న 227, దైవికశ్రీ 223, ధనుంజయ్ 221, విక్టోరియా 221, చారుహాసిని 226, గోవర్దన్ 211, జుహిత 209, జయదీక్షిత్ 216, గోవర్దన్ 211, రాజేశ్ రెడ్డి 210, అఫనన్ 206, వేణుమాధవ్ 205 మార్కులతో అత్యధిక స్కోర్ సాధించారన్నారు. విష్ణు భైరవ 203, శరణ్య 203 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోరంట్ల హసీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైనిక స్కూల్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్

శ్రీచైతన్యలో ఘనంగా ప్రీప్రైమరీ స్పోర్ట్స్ మీట్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ప్రీప్రైమరీ స్పోర్ట్స్ మీట్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ పాఠశాల చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ తబస్సుం,కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు రిషిబాల, అప్పలనాయుడు, ఏఓ గోపాల్, ప్రైమరీ ఇన్‌చార్జ్ నీరజ, భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ కరుణ, పీఈటీలు సురేష్, రవితేజ, గాయత్రి పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకు నేడు సన్మానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన రాష్ట్ర సాఫ్ట్ బాల్ జట్టు క్రీడాకారులకు స్థానిక అనంత క్రీడా గ్రామంలోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు తెలిపారు. కార్యక్రమానికి ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

నేడు సాఫ్ట్‌బాల్ క్లబ్‌ల సమావేశం : ఆర్డీటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ క్లబ్‌ల సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

రాప్తాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన సతీమణి వెన్నపూస హరిత ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆమె మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల స్థానం నుంచి వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఉపాధ్యాయుల స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. వెన్నపూస రవీంద్రా రెడ్డి మండల జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ ప్రతిపక్ష నేతగా, హైకోర్టు లాయర్‌గా సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు రావాలన్నా వెన్నపూస రవీంద్రా రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వర్దిరెడ్డి విజయ్‌వర్ధన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, రాజా రెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎం.బండమీదపల్లిలో ప్రచారం చేస్తున్న వెన్నపూస హరిత

ఆక్రమణల తొలగింపులో విఫలం

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపులో టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టిన చర్యలు విఫలమయ్యాయి. శనివారం ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి బృందం వైద్య కళాశాల ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను తొలగించేందుకు వెళ్లారు. తోపుడుబండ్ల నిర్వాహకులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు రెండ్రోజులు గడువు ఇస్తున్నామని, ఆతర్వాత చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ సిబ్బంది వ్యాపారులను హెచ్చరించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీ పాల్గొన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో మృతి చెందిన అనాథ శవాలకు సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో గుత్తి రోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో సాయి ట్రస్టు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సాయి ట్రస్ట్ రుక్మిణి, హెచ్ఎల్‌సీ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి వేదాద్రి పవన్, సాయి సంస్థ సభ్యులు నారాయణ నాయక్, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భర్త వేధిస్తున్నాడని 'దిశ'లో ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భర్త వేధింపుల నుంచి రక్షించాలని నగరానికి చెందిన లక్ష్మీ అనే మహిళ దిశ పోలీసులను ఆశ్రయించింది. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 18 ఏళ్ల క్రితం వివాహం జరిగిందని, ఐదుగురు సంతానం ఉన్నారని బాధితురాలు తెలిపింది.

ఎ.నారాయణపురంలో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రూరల్ పరిధిలోని ఎ.నారాయణపురం ఇందిరమ్మ కాలనీలోని వడ్డే గుర్రప్ప ఇంట్లో చోరీ జరిగింది. శనివారం గుర్రప్ప కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి కూలిపనులకు వెళ్లారు. ఇదే అదునుగా చూసి ఇంటితాళాలను ధ్వంసం చేసి, ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో దాచి ఉంచిన రెండున్నర తులాల బంగారు నగలు, రూ.25వేలు నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు గమనించి గుర్రప్ప కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితులు నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

చేనేతల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ అప్పాజికి ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, రాజు పాల్గొన్నారు.